
# మందార చెట్టు

రజనీ భరద్వాజ

నేను, చెల్లీ కుక్కిమంచంలో కునికిపాట్లు పడుతూ గమ్మత్తుగా వుయ్యాలూగుతున్నాం. నాకు మెళకువ వచ్చినా కళ్లు మూసుకుని నిద్రపోతున్నట్లు నటిస్తున్నాను. అమ్మ నాకు, చెల్లికీ నిద్రాభంగం కలగకుండా వీధి వాకిట్లో కసువూడుస్తోంది. అమ్మ చీపురు కట్టతో లయబద్ధంగా నేలను తుడుస్తుంటే ఆ శబ్దం నాకు అమ్మ పాడే లాలి పాటను గుర్తుకు తెచ్చేది. మట్టితో చేసిన సీతారాముల బొమ్మల ముందు అమ్మమ్మ పాడే సుప్రభాతం గీతం గుర్తుకొచ్చేది. ఆ శబ్దంలో వినపడే వింత రాగాలనూ, విచిత్ర స్వరాలనూ నా చెవి చాలా ఇష్టంగా వింటూండేది. ఆ శబ్దం నా చెవిన పడగానే నా మనసు పండుగనాడు అమ్మ చేతి పరమాన్నం తిన్నంతగా ఆనందపడేది. అమ్మ చేతి చీపురు చేసే ఆ శబ్ద విన్యాసానికి కసువు కచేరీ అంటూ ముద్దు పేరు పెట్టుకున్నాను. నేనూ, నా చెవులూ, నా మనసూ ఈ కసువు కచేరీలో తన్మయులమై వుండగా నా కన్నులు మెల్లిగా నక్షత్రాల తోటలోకి అలా అడుగులేశాయి.



బజ్జోటానికన్నట్లు బుజ్జి చంద్రుడు పడమర వీధిలోవున్న మబ్బు తెరల దుప్పట్లను మెల్లిగా కప్పుకోసాగాడు. దోమలు కుట్టకుండా చందమామకెంత ముందు చూపో అనిపించింది నాకు. తూర్పు కన్య లేత నారింజ రంగు చీరతో ముస్తాబై పసిడి భానుడి రాకకోసం ప్రేమగా ఎదురుచూస్తోంది. ఇంతలో పెరట్లో స్నానానికై అమ్మమ్మ చేతి పంపును కొడుతుంటే అరిగిపోయిన వాషర్ నుంచి వెలువడుతున్న ధ్వని చిత్రాలు అలా అలా గాలిలో తేలుతూ వచ్చి నా చెవిని తాకాయి అస్పష్టంగా. ఆలకించి వింటే 'అరిగిపోయి, ఇరిగిపోయే దశ నాది నేనింక పనిచేయలేను మొర్రో ఇంక నన్నొదిలేయి' అంటూ దీనాతి దీనంగా 'గర్, గర్, గర్ గర్ ' మంటూ ఏడుస్తూ బ్రతిమిలాడుతున్నట్లుంది.

అమ్మమ్మ మాత్రం ఎవరెట్లాపోతే నాకేంటి....? నా అవసరం నాది అన్న దృష్టితో పట్టుదలగా ఆ పంపును మరింత బాధపెట్టసాగింది. అమ్మమ్మ పెడుతున్న హింసా పూర్వకమైన శ్రమను భరించలేక ఎవరైనా వచ్చి రక్షించరూ... అంటూ హృదయ విదారకంగా ఆ చేతిపంపు చేసిన ఆర్తనాదాల విలాపాలు తిరిగి నా చెవిని సోకాయి. అంతే నాదైన ఊహల లోకంలో నుంచి త్రుళ్లిపాటుగా ఈ లోకంలోకి వచ్చి పడ్డాను. వచ్చి రావడంతోనే మత్తు కళ్లతోనే పెరట్లోకి పరుగుతీశాను. చేతి పంపులో నుంచి వస్తున్న నీటిధారను చూస్తుంటే ఆయాసం తన్నుకొస్తున్నా పట్టించుకోకుండా అరగంట నుంచి ఆ చేతి పంపును టకటకలాడిస్తుంటే ఆ బాధను తట్టుకోలేక చేతిపంపు కార్చిన కన్నీరులా కనిపించాయి.చేతిపంపు కార్చిన కన్నీరుతో బకెట్ సగానికి నిండింది.

అమ్మమ్మతో 'నీలానే ఆ పంపు కూడా ముసిల్దే....పనిచేయలేను బాబోయ్ అని ఏడుస్తుంటే దానెందుకంత బాధపెడతావు' అనే సరికి కడుపులో నుంచి వెల్లువెత్తుతున్న ఆయాసానికి గుండెల్లోంచి నుండి పెల్లుబికిన ఆవేశం తోడై గయ్ మంటూ మనిషేడిస్తేనే సానుభూతి చూపని ఈ లోకంలో...వస్తువులేడుస్తున్నాయని వింతగా జాలి పడతావేంట్రా... ఈ పంపు వచ్చి తన గోడును నీతో వెళ్లబోసుకుందా ఏంటి...? దాని తరపున వకాల్తా పుచ్చుకుని మాట్లాడుతున్నావు. అయినా మీ అయ్యిచ్చిన ముల్లేమన్నా వుంటే పంపు వాషర్‌కు వైద్యం చేయించు' అనబోయి అంతలోనే ఛీ...ఛీ నీ భాష నాక లవాటైంది పోరా పో అంటూ అమ్మమ్మ పసుపు పచ్చగా మెరిసిపోతున్న ఇత్తడి చెంబును సగం నీటితో నిండిన బకెట్లో ముంచింది. బుడ, బుడ, బుడ మంటూ బకెట్లో నీటిని కడుపునిండా తాగేసిందా చెంబు.

నిండిన నీళ్ల చెంబును వంటిపైనున్న బట్టలపై కుమ్మరించుకుంటూ ఓం కేశవాయ స్వాహా...నారాయణాయ స్వాహా...అంటూ సంకల్పం ప్రారంభించింది. నేను మెల్లిగా అమ్మమ్మ నిత్యం పూజించే రాతి తులసి కోట దాటి వంటింటి వైపు అడుగులేస్తున్నాను. వంటింటికి ఖచ్చితంగా పదడుగుల దూరంలో మల్లెతీగ సరసన ఠీవిగా నిలబడింది నా ముద్దుల మందార చెట్టు.

మందార చెట్టు సిగపైన తనువంతా అణువణువూ అందాన్ని ఆరబోసుకొని అరవిరిసిన ముద్ద

మందారం చిరుగాలికి తలూపుతూ...మౌనంగానే నన్ను పలకరించినట్లు అనిపించింది. ఆ మందారాన్ని తాకి ఆనందించాలని, మందార చెట్టుతో ముచ్చట్లాడాలని మనసులో మొలకెత్తిన కోరికను అణుచుకుంటూ ముందుకడుగెయ్యాలని ప్రయత్నించాను. నా వల్లకాక ఆ ప్రయత్నం విఫలమైంది. వెంటనే ఒక్కసారి వెనక్కి తిరిగాను. నాతో పాటు కాలచక్రం కూడా ఒక్కసారి వెనక్కి తిరిగింది.

నేను అటూ ఇటూ చూస్తూ భయం భయంగా మందార చెట్టుకింద వణుకుతున్న చేతితో ఆ మందార పువ్వును ఒక్కసారి ఆసాంతం అలా సున్నితంగా తడిమాను. నా చేతి వేళ్ళ స్పర్శ మందార చెట్టుకు బాగా సుపరిచితం. నా చేతివేళ్ళ స్పర్శను బట్టి నా మనసును చదవగలిగే నేర్పు మందార చెట్టుకు వుంది. స్పర్శ భాషలో భాస, కాళిదాసాదుల కంటే దిట్ట. ఓ వర్షం కురిసిన సాయంత్రం నా చేతిలో నుంచి పొరపాటున పింగాణి జాడీ మూత నేల జారి పగిలి పోయింది. అంతే అమ్మకు పిచ్చికోపం వచ్చింది. అప్పటివరకూ ప్రపంచం పైన అమ్మ మనసులో పేరుకుపోయిన కసి తీరేంతవరకూ తన చేతిలో వున్న చల్ల కవ్వం విరిగి ముక్కలయ్యేవరకూ నా వంటిపైన నాట్యమాడించేసింది. వాచిన వొంటితో నీళ్లు తిరిగిన కళ్లతో బాధనుపంచుకునేందుకు నా ప్రియనేస్తం వద్దకు వెళ్లాను. ఒకే ఒక్క స్పర్శతో నా మనసులోని వేదనా స్థితిని తెలుసుకుందో ఏమోగాని వళ్లంతా కన్నీరై కరిగిపోయింది.

ఆకుల నుంచి రాలిన కన్నీటి వర్షంలో నేను తడిసి ముద్దయ్యాను. ఇలా అమ్మకొట్టినా...పనిచేయలేదని పిన్ని తిట్టినా...పుస్తకాలు కొనలేదని స్కూల్లో మాస్టారు బెంచెక్కించినా నేను సేద తీరే అమ్మ ఒడి వంటి నా మందార చెట్టు నీడనే. తనకు నా రోజు వారీ జీవితం తెరిచిన పుస్తకం. నేను బాధపడితే తల్లిలా తల్లడిల్లిపోయేది. నేనానందపడితే ఆత్మీయుని కంటే ఎక్కువగా ఆనందపడేది. ప్రతిరోజూ నేనాడుకోవడానికి, మనసారా ముచ్చట్లు చెప్పుకోవడానికి ఓ బుజ్జి మందారాన్ని కానుకగా ఇచ్చేది. ఇలా ఇవ్వటమే తప్ప అడగడం తెలియదు తనకు.

అన్నట్లు చెప్పడం మరిచాను. అమ్మానాన్నలది ఇష్టంలేని పెళ్లట. తాను ప్రేమించిన మా చిన్నమ్మమ్మ గారమ్మాయితో వేరే కాపురం పెట్టాడు మానాన్న. మేం ఏ పెళ్లికో, పేరంటానికో వెళితే అమ్మలక్కలు అమ్మచుట్టూ చేరి మీ ఆయన మీ పిన్నిగారమ్మాయిని వుంచుకొన్నాడటగా... అంటూ ఆరాలు తీసేవారు. అమ్మలక్కల మాటలు తన ఆడతనాన్నే శంకిస్తున్నట్లు అనిపించేది అమ్మకు. అంతే అమ్మకు ప్రపంచంపై కసి పేరుకుపోయేది.

ఇతరుల విషయాలపైన ఈ లోకులకెందుకో ఇంతాసక్తి నాకర్థం కాదు. అదలా వుంచితే నాన్ననడిగి బియ్యానికి డబ్బులు తీసుకురాకపోతే అమ్మకు కోపం. ప్రతి రోజూ పిన్ని చెప్పే అడ్డమైన పనులు చేస్తే కానీ నాన్న డబ్బులు ఇచ్చేవాడు కాదు.

పనిచేస్తే స్కూలుకు ఆలస్యమయ్యేది. దాంతో మాస్టారు పేముబెత్తంతో వీపు వాయగొట్టేవాడు. తాయిలంలో భాగం పంచకపోతే నీతో పచ్చి అంటూ దూరంగా జరిగేది చెల్లి. వాళ్ల తాతయ్య పోలికలో వుంటానని అమ్మమ్మ గారాబంగా చూసేది.

ఇలా ప్రతి ఒక్కరూ నన్ను ప్రేమించడానికో, ద్వేషించడానికో వారి కారణాలు వారికున్నాయి. ఏ కారణం లేకుండా నన్ను ప్రేమించి అభిమానించే అమాయక జీవి నా మందార చెట్టు ఒక్కటే. నా మందార చెట్టును ఆ చెట్టుకు పూసే పూలను నేను నా కంటే ఎక్కువగా ప్రేమిస్తాను.

నా ప్రేమను గమనించి 'పిచ్చి కామేశ్వరమ్మ పూలకొచ్చిందే... అంటూ సాగే వెక్కిరింత వ్యాఖ్యానాలు చెవిన పడినా పడనట్లే...నటిస్తూ చెప్పులు లేని కాళ్లతో వూళ్లోని ప్రతి పెరడు కాళ్లరిగేలా తిరిగి పూలు కోసుకొచ్చి తన రాముణ్ణి పూజించుకొనేది.

అమ్మమ్మ నా మందార పూలను మాత్రం ఏరోజు కోసేది కాదు. ఎవరైనా కోసినా మరునాడు మరో మందారం పూసేదాకా అన్నం నీళ్లు నిద్ర మరిచి పోయి అన్నీ కోల్పోయినవాడిలా అక్కడే గడిపేవాడిని. మందార చెట్టుపైన నా ప్రేమ రోజురోజుకి వరద గోదారిలో పెరిగి హృదయాంచలాన్ని తాకటంతో నా కోసం ఎన్నో చేస్తున్న నా మందారం కోసం ఏదో ఒక్కటి చేసి తనను సంతోషపెట్టాలనే చిన్న ఆలోచన



నా చిట్టి మనసుకి తట్టింది. తక్షణం నేను ఇంట్లోకి పరిగెత్తి పుస్తకాల దొంతరలో భద్రంగా దాసుకున్న నాకిష్టమైన నెమలి ఈకను ఒక చేత్తో తీసుకుని, ఎంతో ముచ్చటపడి నేర్చుకున్న వేణువును మరో చేత్తో పుచ్చుకొని పెరట్లోకి పరిగెత్తుకుంటూ వచ్చాను.

నేను తెచ్చిన నెమలి ఈకను మందార గుబురులో ముచ్చటగా అలంకరించేసరికి ఎంతో ముచ్చటపడిపోయిందో. నేను నేర్చుకున్న స్వర సంగతులను వేణువు పై పలికించేసరికి ఆ పాటలో ఏ ఆత్మీయత గోచరించిందో ఏమో ఆత్మానుభూతికి లోనై మందారకొమ్మలన్నీ ఆనంద నృత్యం చేశాయి. ఆకులన్నీ ప్రమోద పరవశమై పులకరించాయి.

ఆరాత్రి ఈ విషయాన్ని అమ్మమ్మ పక్కలోచేరి ఎంతో ఆసక్తిగా చెప్పేసరికి "నువ్వేమన్నా త్యాగరాజువా? శ్యామశాస్త్రివా? నీ సంగీతం విని చెట్టూ పుట్టా మురిసిపోవడానికి గాలికి కొమ్మలూగితే నీ సంగీతానికే ఊగినట్టుగా భ్రమపడుతున్నావ్" అంటూ నా మాటలను తోసిపుచ్చటమే కాకుండా "అంతగా నువ్వా మందార చెట్టుని ప్రేమిస్తే రోజూ ఆ చెట్టుకు దురులో నీళ్లు పోయి" అంటూ సలహా పారేసి మెల్లిగా నిద్రలోకి జారిపోయింది.

నాకు మాత్రం ఆ రోజు రాత్రంతా నిద్రపట్టలేదు. ఎప్పుడూ తెల్లవారువుతుందా నా మందార చెట్టుకు నీళ్లు ఎప్పుడు పోద్దామా అనే ఆలోచనే నా మనసంతా. ఏతెల్లవారుజామునో మాగన్నుగా నిద్రపట్టింది ఏంటా మొద్దు నిద్ర అంటూ అమ్మ అరచి లేపే దాకా నిద్రపోయాను. ప్రేమ ఎక్కువైతే కలిగే ఫలితం ఆరోజే నా కనుభవంలోకి వచ్చింది.

మంచం పై నుంచి ఒక్క గెంతుతో పెరట్లోకొచ్చాను. ముసలి పంపును శ్రమ పెట్టడం ఇష్టం లేక చేద తీసుకొని బావి వద్దకు వెళ్లి చకచకా నీళ్లు తోడి మందార చెట్టు మొదట్లో పోస్తుంటే చూసిన అమ్మ 'కొత్తపిచ్చోడు' పొద్దెరగడన్నట్లు అలా అన్ని నీళ్ల పోయకు. పోస్తే వేళ్లు కుళ్లి చెట్టు చస్తుంది అనే సరికి నా కళ్లు భయానికి నిలయాలయ్యాయి.

అనాథనైపోతాననే భావన మనసంతా పాకింది. సుడులు తిరిగే కన్నీటిని తుడుచుకోవడానికి నా అరిచేతులను చూసుకునేసరికి నిత్యం వరిపిండితో తనను శ్రమ పెట్టే గిలకపైన పెంచుకున్న కోపాన్ని చేద నా అరిచేతుల మీద చూపించినట్లయింది. నా అరచేతులు రెండూ ఎర్రగా కందిపోయి వున్నాయి.

నా మందారాన్ని తాకితే నా బాధ తన బాధగా చేసుకుని ఎక్కడ అల్లాడిపోతుందోనని ముట్టుకోవాలనే కోరికను అణిచేసుకొని లోపలికి వెళ్లాను. మందార చెట్టు మాత్రం మౌన ఋషిలా జరుగుతున్న సంఘటనలను తిలకిస్తూనే వుంది. నా మందార చెట్టుకు ఏదో చేయాలనే తపన నాలో తపస్సులా పెరుగుతూనే వుంది. ఏ క్షణాన నేను ఎక్కడున్నా, ఏం చేస్తున్నా, నా మనస్సు మాత్రం మందార చెట్టు చుట్టూనే తిరుగుతూ వుండేది.

ఎప్పుడు పరధ్యానంగా వుంటున్న నన్ను చూసి అమ్మ ప్రేమగా వడిలోకి తీసుకొని ముంగురులు తన చేతితో నిమురుతూ ప్రపంచాన్ని ఇంతగా ప్రేమించే నువ్వీ ప్రపంచంలో ఎలా బ్రతుకుతావో ఏంటో అంటూ నా మనసు తెలిసినట్లు "చెట్టుకి ఎండుటాకులు అదనపు భారం. వాటిని దులిపి చెట్టు కుదుట్లో వేసావంటే ఎండుటాకులే జీవసారంగా మారి చెట్టుకు బలాన్నిస్తాయి" అంటూ జీవిత సత్యాన్ని చిన్న చిన్న మాటల్లో చెప్పింది.

అమ్మ ఎంతో ప్రశాంతంగా వుంటేనే గాని నాపై అంత ప్రేమ చూపించదు. మరునాడు అందరికంటే ముందు నిద్రలేచి ప్రతిరోజూ నేను క్రమం తప్పకుండా హాజరయ్యే కసువు కచ్చేరి, విహంగ వీక్షణం త్యాగం చేసి మంచం పైనుంచి మందార చెట్టు కిందకు చేరాను. పచ్చని ఆకులతో పురుడు పోసుకోవడానికి సిద్ధమైన గర్భిణీ స్త్రీలా నిండుగా వుంది.

కనుల విల్లును సారించి చూపుల బాణాలు సంధిస్తే గాని... ఎండుటాకుల ఆనవాలు తెలియలేదు. చిటారుకొమ్మకెక్కడో దిష్టిచుక్కలా నిటారుగా నిలుచున్నాయి మూడు ఎండుటాకులు. అందనంత ఎత్తులో నిలబడి అందుకో చూద్దాం అన్నట్లున్న ఆకులను ఎలా అందుకోవాలో తెలియక అయోమయంలో పడ్డాను. దూరంగా జామచెట్టుకు ఆన్చి నిలిపిన వంకీ కర్ర నా దృష్టిలో పడింది.

ఆ వంకీ కర్రకేసి అలా అడుగులేస్తున్నంతలో క్రితం రోజు జరిగిన సంఘటన మనసులో మెదిలింది. నిన్న ఉదయం స్కూల్లో జామకాయలంటే తెగ ఇష్టపడే పక్కింటి జనార్దన్ మీ అమ్మ లేనపుడు జామకాయలు కోసుకుందాం నీ కొకటి, చెల్లికొకటి, నాకొకటి అంటూ వెంటబడ్డాడు. మధ్యాహ్నం అమ్మ మిషన్ నేర్చుకోవటానికి మహిళామండలికి వెళ్లింది. అమ్మమ్మ మడత మంచంపై ఆదమరిచి నిద్రపోతోంది. నేను, చెల్లి స్కూలు పుస్తకాలు ముందు వేసుకొని కూర్చున్నాం.

అంత నిద్రలో కూడా అమ్మమ్మ చదవండ్రా అంటూ కలవరించేది. ఇంతలో జనార్ధనంగాడు

పెరట్లో చేరి జామకాయలు కోద్దామని తెగ సైగ చేస్తున్నాడు. నేను మెల్లిగా పుస్తకం మూసి చెల్లికి సైగ చేసి అలికిడిలేకుండా పెరట్లోకి వెళ్లా. నా రాక జనార్దన్‌కి ఎక్కడలేని ధైర్యాన్ని ఇచ్చింది. మిగల మగ్గిన జామకాయల గుత్తికి వంకీ కర్రను పట్టించి లాగాడు . వుత్సాహం ఎక్కువ అవ్వటంతో కాయలతో పాటు కొమ్మ కూడా విరిగింది.

విరిగిన కొమ్మ చూస్తే అమ్మ బడిత పూజ చేయడం ఖాయం. ఆ భయంతో రాలిన ఆకులను ఏరి రోడ్డు పక్కన పడేస్తే ఎవరైనా అమ్మతో చెపుతారని రెండు రోడ్లకు అవతల పారేసి వచ్చాం. జరిగింది అంతా సినిమా రీలులా కళ్ల ముందు తిరిగేసరికి బంగారుకొండ, వజ్రాల కొండ అంటూ ముద్దు ముద్దుగా పిలిచే పిచ్చి మందారాన్ని ఎండిన ఆకుల కోసం కొమ్మను విరిచేయడం అనే ఊహే మనసును మెలిపెట్టింది.

ఇంతటితో ఆ ప్రయత్నాన్ని విరమించుకొని ఎలానా ఆలోచిస్తుంటే నా మందార చెట్టుకు సరిగా గజన్నర దూరం నుంచి ప్రహరీగోడ అలా ముందుకు సాగడం నా కంట పడింది. తల పైకెత్తి చూస్తే మందార చెట్టు గుబురు గోడవరకూ విస్తరించింది. గోడ ఎక్కగలిగితే చాలు మందార చెట్టు సిగలో నిర్జీవంగా వున్న ఎండుటాకులను దులపడం తేలిక అవుతుందనిపించింది.

గోడ ఎక్కడానికి మార్గాలు అన్వేషిస్తుంటే గోడ రెండుచోట్ల బీటలు పడడం వలన కాలు పెట్టే పగులు కనిపించింది. ఆ గోడ పగుళ్లో కాలు పెట్టి ఆసరాగా చేత్తో మందార కొమ్మను పట్టుకుంటే గోడపైకి ఎక్కవచ్చు అనిపించింది. వెంటనే కోతిపిల్లలా గోడ ఎక్కేశాను. ఆ పక్కింట్లో పిప్పళ్ల బస్తాల్లా వుండే లెక్చరర్ గారి పిల్లలిద్దరూ అప్పుడే కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన టూత్‌పౌడర్‌ను బ్రష్ పై వేసుకొని అరిగిపోయే స్థాయిలో పళ్లు తోముతున్నారు.

ఈ వైపు జనార్దన్ చింతపండుపై నీళ్లు చల్లడం, కందిపప్పులో రాళ్లు కలపడం వంటి రోజువారీ పనిలో వున్నాడు. ఇవేం పట్టించుకోకుండా నేను నా మందారానికి దిష్టిచుక్కలా నిలిచిన ఆ మూడాకులను అందుకుని తెంచి ఆనందంతో గోడపై నుంచి కిందకు దూకేశాను. నేలపై ఏమున్నాయో పట్టించుకోకుండా గోడపైనుంచి కిందకు దూకేసరికి కిందనన్ను గులకరాళ్లు తగిలి మోకాలి చిప్పలు పగిలాయి. మందార చెట్టుతో నా విజయానందాన్ని పంచుకోవాలనే తపన ఎక్కువవడం వలన మోకాలి చిప్పల బాధ నాకు అంతగా తెలియలేదు.

క్షణం ఆలస్యం లేకుండా పడి లేచి నా మందార చెట్టుపైన కౌగిలించుకున్నట్లుగా వాలిపోయాను. నా చేయి తగిలితేనే కోడెగిత్తలా చెంగు చెంగునా ఆనందంతో గంతులేసే మందారం ఎందుకో ఆక్షణం ఎంతో స్తబ్దతగా వుంది. ఎంత ప్రయత్నించిన నిరాశే ఎదురైంది. కళ్ల నీళ్లు గిర్రున తిరిగాయి. కన్నీళ్లుచూసి మందారం కాస్త మెత్తబడింది. ఎందుకిలా చేశావని అడిగింది, నేనేం చేశానంటూ తెల్లమోహం వేశాను. నా ఆకులను కోసి నన్నెందుకు బాధపెట్టాలనుకున్నావు అంది.

ఎండిన ఆకులు చెట్టుకు బరువని అమ్మ చెప్పింది అంటూ నసిగాను. వెంటనే కోపంతో ఊగిపోతూ నాకు మనసుంటుందని దానికి ఇష్టా ఇష్టాలుంటాయని ఆలోచించలేదా, కదల్లేదు, మెదల్లేదు. ఇదేం చేయగలదులే అనే నిర్లక్ష్యమా...? నా మనసు తెలుసుకుంది. ఇదేనా అనేసరికి మందార చెట్టు మాటల్లోని భావం నా చిన్నతనానికి అర్థం కాకపోయినా మందార చెట్టుకు కోపం వచ్చిందనే విషయమై అర్థమై చిగురుటాకులా వణికిపోయాను.

మోకాలి చిప్పల గాయం పెట్టిన బాధ కంటే మందార చెట్టు మాటలు నన్నెంతో బాధించాయి. ముందు ముందు ఏ పనిచేసినా తనకు చెప్పే చేయాలని నిర్ణయించుకొన్నా. ఏమనుకుందో ఏమో నన్ను చేరువగా రమ్మని పిలిచి తన కొమ్మలను చేతులుగా చేసుకొని నా జుట్టును సవరిస్తూ నేను జన్మనిచ్చిన ఆకులు, పువ్వులు ఎండిపోయినంత మాత్రాన నాకు బరువు కాదు. వాటికవి తొడిమలు ఒడలి రాలిపోవాలి తప్ప నా ఎదుగుదలకు పనికిరావని నిర్లక్ష్యంగా వదిలించుకోవడం నాకు చేతకాదు అంది అనునయంగా.

మందార చెట్టు మాటలు వినగానే చిన్నతనం నుంచి కళ్లల్లో వత్తులసుకొని పెంచి పెద్దచేసిన తల్లిని బిచ్చమెత్తుకునేలా చేసాడని ఆదిశేషు మామయ్యను



లోకం నిందించిన వైనం గుర్తుకొచ్చింది. ఆలోచనా విధానంలో మనిషికి చెట్టుకీ వున్న తేడా ఆ రోజే నాకర్థమయ్యింది. మందార చెట్టుతో చివాట్లు తిన్న తరువాత ఎలాగైనా సరే ఏం చేసయినా సరే తిరిగి మెప్పు పొందాలనే పట్టుదల పెరిగింది.

ఈసారి ఎవరి మాట వినకూడదు స్వంత నిర్ణయం తీసుకోవాలనుకున్నా. ఏం చేద్దామా అని ఆలోచిస్తూ ఓ రోజు రాత్రి పడుకుని రేడియోలో వివిధ భారతిలో వచ్చే పాటలు వింటున్నప్పుడు ''చేనుకు చేవ రైతుకు రొక్కం'' అనే ప్రచార వాక్యం నా చెవిలో పడింది. పదిరోజులు మార్కెట్‌కు నడిచి వెళ్లి యాభై పైసలు దాచాను. దాచిన అర్ధరూపాయిలతో మార్కెట్‌కు వెళ్లి మందార చెట్టుకు బలం కోసం యూరియా మందు కొనుక్కొచ్చాను. మందార చెట్టు మొదలు శుభ్రం చేసి కుదురు వేసి యూరియా గుళికలు చల్లి బావిలోంచి నీళ్లు తోడిపోసాను.

ఆ రోజు ఇద్దరమూ ఆడుకున్నాం. పాడుకున్నాం. గంతులేశాం. గోల చేశాం. గతంలోకి జారాం. భవిష్యత్తులోకి పరుగులు తీశాం. గంటలు నిమిషాలయ్యాయి. నిమిషాలు క్షణాలయ్యాయి. జీవితానికి సరిపోయే ఆనందాన్ని ఆ ఒక్కరోజే అనుభవించాం. అలా వర్తమానాన్ని తనివితీరా ఆస్వాదించాం. అలసి సొలసి ఇద్దరమూ నిద్దరోయాం. ఆ రాత్రి మంచం అరిగేలా నాకు నిద్ర పట్టింది.

మరునాడు వేకువ కోకిల మెలకువ గీతం పాడగానే రోజులానే నిద్ర మంచం పై నుంచి సరాసరి మందార చెట్టు వద్దకు వెళ్లాను. నా మందార చెట్టులో ఏదో మార్పు నీరసంగా నిస్తేజంగా కనిపించింది. ఆ మార్పును నేను కనిపెట్టలేకపోయాను. నేను నీకు జ్వరం వచ్చిందా అని అడిగేసరికి అవునంటూ అమాయకంగా తలూపింది. దాంతో అంతకుముందు రోజు తెచ్చిన యూరియా గుళికలు మరిన్నింటిని మందార కుదుట్లో చల్లి నీళ్లు పోశాను. వళ్లంతా నీరసం కమ్మినా ఉత్సాహాన్ని తెచ్చిపెట్టుకుని నాతో కబుర్లు చెప్పాలని చూసింది. నేను వారించి విశ్రాంతిగా నిద్రపో అన్నీ తగ్గిపోతాయని చెప్పి ఇంట్లోకి వచ్చేశాను.

తన కంటపడితే ఎక్కడ విశ్రాంతి తీసుకోకుండా కబుర్లాడుతుందో అన్న భయంతో ఆ రోజంతా చాలా దూరంగా గడిపాను. ఆరోజు గడిచే సరికి నాకు యుగాలు గడిచాయని అనిపించింది. మర్నాడు ఉదయం మందార చెట్టు వద్దకు వెళ్లేసరికి తన పరిస్థితి పూర్తిగా దిగజారిపోయింది. ఆ పరిస్థితుల్లో తనను చూసేసరికి ఏడుపు తన్నుకొచ్చేసింది. తనను కౌగిలించుకొని ఏడ్చేశాను.

వెంటనే నన్ను నేను సంబాళించుకొని నిన్ను హాస్పిటల్‌కు తీసుకువెళతాను. డాక్టర్ మందు ఇస్తాడు తగ్గిపోతుందని ధైర్యం చెప్పి ఇంట్లోకి పరిగెత్తాను.

అమ్మ చేస్తున్న పనికి అడ్డుపడి మందార చెట్టుకు జబ్బు చేసింది హాస్పిటల్‌కి తీసుకెళదాం అని మారాం చేశాను. వాళ్లు నా బాధను అర్థం చేసుకోకుండా పిచ్చాడిననుకుంటూ నవ్వుకున్నారు. క్షణాల్లో పెద్దవాడినైపోయి నా మందార చెట్టును కాపాడుకోవాలనిపించింది. మొట్టమొదటిసారి అమ్మ మీద కోపం వచ్చింది నేను ఎంత ఏడ్చి మొత్తుకున్నా ఈ ప్రపంచానికి నా ఏడుపు పట్టకుండా పోయింది.

వారం తిరిగేసరికి పచ్చగా వుండే నా మందారం గచ్చకాయ్ రంగులోకి మారి ఎండిపోయింది. మందార చెట్టుపై దిగులుతో నేను వారంరోజులుగా మూసిన కన్ను తెరవలేదు. నాకోసం అమ్మ తిరగని డాక్టర్ లేడు. మొక్కని దేవుడు లేడు అయినా నా పరిస్థితిలో మార్పులేదు. ఆ జ్వరంలో నాన్న బియ్యానికి డబ్బులియ్యి...పిన్నీ నేను అంట్లు తోమలేను..మాస్టారు కొట్టకండి అంటూ పిచ్చి పిచ్చిగా కలవరించానట. నా కలవరింతలు విని చుట్టుపక్కల అమ్మలక్కలు అమ్మతో నీ సవితి నీ కొడుకుపై చేతబడి చేయించిందంటూ రకరకాలుగా మాట్లాడారు.

మూసిన కన్ను తెరవకుండా శవంలా మంచంపై పడుకున్న నన్ను తన ఒడిలోకి తీసుకొని అమ్మ చూపిన ప్రేమ నా మనసుపైన మందుగా పనిచేసిందో ఏమో ఒక్కసారి మెల్లిగా కళ్లుతెరిచి మందారం మందారం అంటూ కలవరించి తిరిగి మైకంలోకి జారాను. జరిగిందంతా అమ్మ మనసు గ్రహించింది.

వెంటనే ఓ మందార మొక్కను తీసుకువచ్చి నా మందార చెట్టు వున్న చోట నాటింది. ఎంతటి విషాదానికైనా కాలమే మందు అన్న నిజాన్ని మరోసారి నిరూపిస్తూ నేను మెల్లిగా కోలుకున్నాను. నా మందార చెట్టుపైన నేను విపరీతంగా పెంచుకున్న ప్రేమలో కల్తీ వుందో, నేను కష్టపడి తెచ్చిన యూరియాలో కల్తీ వుందో ఆ రోజు నాకర్థం కాలేదు. కానీ ఈరోజు పూర్తిగా అర్థమైంది. ఆరోజే మానవత్వం కల్తీ అయ్యిందని,...మనిషి తత్వం మలినమైందని.....